# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 29-05-2024** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్ల జిల్లాలో స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లను రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ పరిశీలించారు.**
2. **జూన్ నెల పింఛన్ల నగదును ప్రత్యక్ష నగదు బదిలీ విధానంలోనే లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయనున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది.**
3. **తెలంగాణలోని మూడు పురపాలక సంఘాల్లో ఖాళీ అయిన ఛైర్మన్, వైస్ ఛైర్మన్ పదవులకు ఈనెల 31వ తేదీన ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం తెలిపింది.**
4. **పాన్ కార్డును ఈ నెల 31లోపు ఆధార్‌తో తప్పనిసరిగా అనుసంధానం చేయాలని ఆదాయ పన్ను శాఖ పేర్కొంది.**
5. **ఈరోజు అంతర్జాతీయ శాంతి పరిరక్షకుల దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం.**

============================

ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జూన్ 4 వ తేదీన జరుగనున్న ఓట్ల లెక్కింపు ప్రక్రియకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా తెలిపారు. నిన్న బాపట్ల జిల్లాలో పర్యటించిన ఆయన బాపట్ల ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములను పరిశీలించారు. అనంతరం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్ బాషా, జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఇతర అధికారులతో సమావేశమై స్ట్రాంగ్ రూములు కౌంటింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు, భద్రత చర్యలపై సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ముఖేష్ కుమార్ మీనా మాట్లాడుతూ, బాపట్ల జిల్లాలోని ఆరు శాసనసభ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు ప్రక్రియకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఎన్నికల కమిషన్ జారీ చేసిన గుర్తింపు కార్డు ఉన్న వారిని మాత్రమే కౌంటింగ్ కేంద్రాలకు అనుమతించాలన్నారు. స్ట్రాంగ్ రూముల వద్ద పటిష్టమైన భద్రత కొనసాగించాలన్నారు. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో జూన్ నెలకు సంబంధించిన సామాజిక భద్రత పింఛన్ల నగదు కూడా గత నెలలో జమచేసిన ప్రత్యక్ష నగదు బదిలీ విధానంలోనే లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. లబ్ధిదారుల ఆధార్ నంబరు అనుసంధానమై ఉన్న బ్యాంకు ఖాతాలో నేరుగా పింఛను నగదు

జమ చేయనున్నట్లు తెలిపింది. కాగా దివ్యాంగ లబ్ధిదారులు, తీవ్రమైన అనారోగ్య కారణాలతో పింఛన్లు పొందుతున్న వారు, మంచం లేదా వీల్‌చైర్‌కు పరిమితమైన వారికి గత నెలలో మాదిరిగానే గ్రామ వార్డు సచివాలయాల ఉద్యోగులు ఇంటి వద్దే పింఛన్లు పంపిణీ చేయనున్నారు.

---------------------------

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు సోనియా గాంధీని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ఆహ్వానించారు. నిన్న ఢిల్లీ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి సోనియా గాంధీతో సమావేశం అయ్యారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ. జూన్ 2వ తేదీన జరిగే రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు హాజరు కావాలని ఆహ్వానించామన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు తర్వాత, జరిగే తొలి రాష్ట్రావతరణ వేడుకలు కావడంతో ఘనంగా నిర్వహించనున్నామని తెలిపారు. సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో ఈ వేడుకలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు.

---------------------------

తెలంగాణలో వివిధ కారణాలతో మూడు పురపాలక సంఘాల్లో ఖాళీ అయిన ఛైర్మన్, వైస్ ఛైర్మన్ పదవులకు ఈనెల 31న ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ పార్థసారథి తెలిపారు. కొల్లాపూర్, కామారెడ్డి సంఘాల్లో వైస్ ఛైర్మన్‌లు, నార్సింగి పురపాలక సంఘానికి ఛైర్మన్, వైస్‌ఛైర్మన్‌ల ఎన్నికలు 31వ తేదీన ఉదయం 11 గంటలకు జరుగుతాయని వెల్లడించారు.

---------------------------

త్వరలో కాలపరిమితి ముగియనున్న 17వ లోక్ సభ – మహిళా రిజర్వేషన్ బిల్లు, ట్రిపుల్ తలాక్ రద్దు, భారతీయ న్యాయ సంహిత బిల్లులతో సహా పలు చారిత్రాత్మక చట్టాలు చేసిందని లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా అన్నారు. ఢిల్లీలో నిన్న స్పీకర్ మాట్లాడుతూ, ఈ చట్టాలు దేశాన్ని సానుకూల మార్పులతో మరింత ముందుకు తీసుకెళ్తాయని అన్నారు. 17వ లోక్ సభలో జరిగిన చర్చలు వికసిత్ భారత్ నిర్మాణానికి మార్గనిర్దేశం చేస్తాయని తెలిపారు. పార్లమెంట్ కు కొత్తగా ఎన్నికయ్యే ఎంపీలకు స్వాగతం పలికేందుకు ప్రత్యేక ఏర్పాట్లు జరుగుతున్నాయని పేర్కొన్నారు.

---------------------------

పాన్ కార్డు ఉన్న ప్రతి వ్యక్తీ ఆదాయపు పన్ను చట్టం–1961 ప్రకారం ఈ నెల 31వ తేదీలోపు ఆధార్‌తో తప్పనిసరిగా అనుసంధానం చేయాలని ఆదాయ పన్ను శాఖ పేర్కొంది. ఆధార్‌తో అనుసంధానంచేయనివారి పాన్ కార్డు ఇప్పటికే నిరుపయోగంగా మారిందని, అలాంటి వారు వెయ్యి రూపాయల అపరాధ రుసుముతో అనుసంధానం పూర్తి చేసుకోవచ్చని తెలిపింది.

---------------------------

ఈరోజు అంతర్జాతీయ శాంతి పరిరక్షకుల దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ పలు దేశాల్లో రక్షణ, సౌభాతృత్వాన్ని కాపాడేందుకు శాంతి కాముకులు అలుపెరుగని కృషిచేస్తున్న నేపథ్యంలో వారి సేవలను గుర్తించేందుకు ఐక్యరాజ్యసమితి ప్రతి ఏటా మే 29వ తేదీన అంతర్జాతీయ శాంతి పరిరక్షకుల దినోత్సవంగా పాటిస్తోంది. 1948 నుంచి ప్రపంచ శాంతిని నెలకొల్పడంలో ప్రాణాలర్పించిన 3 వేల 8 వందల మంది శాంతి పరిరక్షకులను ఐక్యరాజ్యసమితి ఏటా గౌరవిస్తోంది. 'అందరం కలిసి మెరుగైన భవిష్యతును

నిర్మిద్దాం' అనే ఇతి వృత్తంతో ఈ ఏడాది అంతర్జాతీయ శాంతి పరిరక్షకుల దినోత్సవాన్ని పాటిస్తున్నారు.

---------------------------

తెలంగాణ సంక్షిప్త నామం టీజీ అక్షరాలతో కేంద్ర ప్రభుత్వం నుంచి గెజిట్ నోటిఫికేషన్ విడుదల కావడంతో టీజీ నెంబర్ ప్లేట్‌తో వాహనాల రిజిస్ట్రేషన్ ప్రారంభమైందని అధికారులు తెలిపారు. అన్ని కార్పొరేషన్ల బోర్డులు, వెబ్ సైట్లలలో టీజీ అక్షరాలతో మార్పులు చేస్తున్నామన్నారు. జూన్ 2వ తేదీ నాటికి పూర్తిగా తెలంగాణ ప్రభుత్వ సంస్థలు, వెబ్ సైట్‌లను టీజీ అక్షరాలతో మార్పు చేస్తామని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

---------------------------

తెలంగాణలో సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణపై ప్రత్యేక దృష్టిసారించాలని.. జలాశయం గేట్లు, కాలువల మరమ్మతులు, ఇతర పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని రాష్ట్ర నీటిపారుదలశాఖ నిర్వహణ కమిటీ అధికారులకు సూచించింది. వర్షాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రాజెక్టుల నిర్వహణ, చేపట్టాల్సిన పనులపై నిన్న హైదరాబాద్‌లో కమిటీ ప్రధాన ఇంజినీర్ ఇన్ చీఫ్ నాగేంద్రరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో అన్ని ప్రాజెక్టుల ప్రధాన ఇంజినీర్లు పాల్గొన్నారు. ఈ సమావేశంలో గేట్ల నిర్వహణకు నీటి ప్రవాహానికి ఇబ్బందులు లేకుండా చూడటం, పంపుహౌస్‌ల నిర్వహణ, మోటార్లు, పంపులు, ప్యానల్‌బోర్డుల నిర్వహణ వంటి అంశాలపై చర్చించారు. చెరువులు, చెక్‌డ్యాంల మరమ్మతులు, ఎత్తిపోతల నిర్వహణను పూర్తి చేయాలని కమిటీ అధికారులకు సూచించింది.

---------------------------

వైద్యులు క్యాన్సర్ చికిత్సా విధానాలపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని ఏలూరు జిల్లా వైద్యాధికారి డాక్టర్ శర్మిష్ట పేర్కొన్నారు. నిన్న ఏలూరు ప్రభుత్వ వైద్య కళాశాలలో వైద్యనిపుణులకు ఏర్పాటు చేసిన క్యాన్సర్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించి ఆమె మాట్లాడుతూ, ఈ శిక్షణ ద్వారా క్యాన్సర్ పై అవగాహన పెంచుకోవాలన్నారు. తద్వారా ప్రజలలో అవగాహన కల్పించి వారిలో క్యాన్సర్ యొక్క లక్షణాలు వుంటే ముందుగా గుర్తించి వారికి వైద్య పరీక్షలు నిర్వహించి, మెరుగైన వైద్యాన్ని అందించవచ్చని తెలిపారు.

---------------------------

ఓట్ల లెక్కింపు ప్రక్రియ అంశాలపై అధికారులు అవగాహన పెంపొందించుకోవాలని కాకినాడ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జె.నివాస్ సూచించారు. నిన్న కలెక్టర్ కార్యాలయంలో ఎన్నికల అధికారులకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఓట్ల లెక్కింపులో అనుసరించాల్సిన విధానం, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కౌంటింగ్ అధికారులు, సూక్ష్మ పరిశీలకులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా జూన్ 4వ తేదీన ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిర్వహించాలని తెలిపారు.

=====================